**International Journal of Academic Research** P-ISSN: 2348-7666: Impact Factor: 6.023
Homepage: https://www.ijar.org.in/
Volume-12, Issue-4, Oct-Dec-2025
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# తెలుగు సాహిత్యం - అభ్యుదయ కవిత్వోద్యమ ప్రభావం

**డా. పులపర్తి శ్రీనివాసరావు**

అతిథి అధ్యాపకులు, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం

భావ కవిత్వానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గ చైతన్యానికి, సరికొత్త కవితా రీతికి పునాది వేసినవారు శ్రీరంగం శ్రీనివాసరావు గారు. 'ప్రగతి' అనే అర్థంలో 'అభ్యుదయం' అనే పదాన్ని మొదటిసారిగా ప్రయోగించారు.

"నేడే - ఈ నాడే
జగమంతా బలివితర్ధి
నరజాతికి పరివర్తన
నవ జీవన శుభసమయం - అభ్యుదయం" అని శ్రీశ్రీ గారన్నారు.

భారతీయ అభ్యుదయ సాహిత్యోద్యమం ఒక చారిత్రక అవసరంగా ఆవిర్భవించింది. యువత యావత్తు పాతను ఒక రోతగా కొత్తను ఒక వినూతన కాంతివలయంగా పరిగణిస్తున్న కాలంలో లండన్‌లోని భారతీయ రచయితలు వెలువరించిన కరపత్రంతో అభ్యుదయ కవిత్వం అంకురించింది. లండన్ రచయితల మేనిఫెస్టో సూత్రధారులు సజ్జాద్ జాహీర్, ముల్క్‌రాజ్ ఆనంద్. కరపత్ర రూపంలో వచ్చిన ఈ మేనిఫెస్టోను "లెఫ్ట్‌రివ్యూ" పత్రిక సమీక్ష చేసింది. నూతన ఆకాంక్షలు, సరికొత్త ఆశయాలు ఈ కరపత్రంలో ఉన్నాయన్న వాస్తవం సమస్త సాహితీలోకం గుర్తించింది. అంతేకాకుండా మేధావి వర్గం గుర్తించి దానిపై చర్చలు చేయసాగారు. పండిట్ నెహ్రూ అందించిన ఆశీస్సులతో మున్సీప్రేమ్‌చంద్ అధ్యక్షతన 1936లో లక్నో నగరం వేదికగా తొలి అభ్యుదయ రచయితల మహాసభలు జరిగాయి.

1936 సెప్టెంబర్ ఫైజాపూర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభల సందర్భంగా సరోజినీ నాయుడు అధ్యక్షతన రచయితల ఇష్టాగోష్ఠి జరిగింది. అదే సమయంలో జాతీయోద్యమంలో అతివాద యువకుల క్రియాశీల ప్రమేయం పెరగసాగింది. ఇటువంటి పరిణామాల మధ్య నేపథ్యంలో 'అభ్యుదయ రచయితల సంఘం' ఏర్పడటం, సంస్థలోని కవులు రాసిన కవిత్వం అభ్యుదయ కవిత్వంగా ప్రచారమవడం జరిగింది.

"అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణలకు రాసాస్వాదనకు సంబంధించింది. సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరగబడు తున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణం. కొన్నికారణాలవల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోన్ముఖంగా తిప్పటానికి నేటి రచయితలు పాటు పడుతున్నారు" అని అభ్యుదయ కవిత్వం గురించి శ్రీశ్రీ అన్నారు.

ఈ విధంగా అంతర్జాతీయంగా, జాతీయంగా ఎంతో విభిన్నమైన రీతిలో ప్రారంభమైన అభ్యుదయసాహిత్యోద్యమాన్ని ఆంధ్రదేశం కూడా ఆస్వాదించింది, ఆమోదించింది. ఆచరణకు పూనుకుని అభ్యుదయాన్ని అందలమెక్కించింది. లక్నోలో జరిగిన అభ్యుదయ సాహిత్య సమావేశాలకు చాలామంది తెలుగువారు హాజరై తమకున్న పరిజ్ఞానంతో మార్క్సిస్టు సాహిత్యాన్ని, తాత్విక సూత్రాల్ని అధ్యయనం చేశారు. వీరిలో ముఖ్యంగా కాంగ్రెస్‌నుండి విడిపోయి 'కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ' గా ఏర్పడి వామపక్ష భావాలతో అభ్యుదయసాహిత్యోద్యమాన్ని ఆహ్వానించారు.

ఆంధ్రదేశంలో ఏర్పడిన "ఆంధ్రవర్ధమాన లేఖక సంఘం" తదనంతర కాలంలో అభ్యుదయ రచయితల సంఘంగా అవతరించింది. అభ్యుదయ రచయితలకు 'తెనాలి' వేదికయింది. అలాగే చదలవాడ పిచ్చయ వంటి వారు ఈ సంఘానికి సంఘీభావం తెలిపి సంస్థ అభివృద్ధికి పాటుపడ్డారు. ఆంధ్రదేశంలో అభ్యుదయ రచయితల సంఘం తొలి సమావేశం 1943 తెనాలిలో జరిగింది. ఈ సమావేశానికి తాపీ ధర్మారావు గారు అధ్యక్షత వహించారు. మొదటి సమావేశం నుండే ఈ సంఘానికి పెద్ద మొత్తంలో మద్దతు లభించింది. దేవులపల్లి వెంకటకృష్ణ శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, పి.వి. రాజమన్నార్ మొదలగు ప్రముఖులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

అభ్యుదయ సాహిత్యం క్రియాశీలత పర్యవసాయి, కార్యోత్సాహకారి. అంటే కొంత అర్థమయినట్లే ఉంటుంది. అభ్యుదయ సాహిత్యం వ్యక్తి నిష్ఠంకాదు. వ్యవస్థా నిష్ఠం. ఇప్పుడు సాహిత్యం సామాజిక చర్య. సమాజకేంద్రం, లక్ష్యం, కారణం, కార్యం. ఈ సాహిత్యంలో సామాజిక పరిణామం ఇమిడి ఉంది. చారిత్రక, భౌతికవాద సూత్రాల మేరకు సమాజంలోనే మానవాళికి సుఖం, శాంతీ లభిస్తాయి. అందువల్ల సాహిత్యకారుడికి వీటి అధ్యయనం అవసరం. సానుభూతివల్ల సమస్యలు పరిష్కారం కావు. కాని క్రియాశీలం నుంచి పరిష్కారం లభిస్తుంది. అటువంటి దారిలోనే సాంఘిక రుగ్మతలకు సాహిత్యం, కళలు చక్కని వైద్యం అవుతాయి. అటువంటిదే అభ్యుదయ సాహిత్యంగా పిలవబడుతుంది.

తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడిత జనపక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను అభ్యుదయ కవిత్వం ప్రవేశపెట్టింది. సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటదారిని చేసి తన పంథాను నిలబెట్టుకుంది అభ్యుదయ కవిత్వం.

రచయిత నిజంగా కొన్ని ఆశయాలకు తను కట్టుబడి ఉండి ఉంటే ప్రజలతో మిళితం కావాలి. పాతప్రపంచం, సంప్రదాయాలు విచ్ఛిన్నమైపోతున్నపుడు నూతన తత్వంలో వాటిని పునరుద్ధరించాలి. దీని అర్థం రచన ప్రత్యేక సంప్రదాయాలతో పోషించబడ్డ కళ అని గుర్తించక పోవడం కాదు. సమగ్రమైన నూతన విజ్ఞానం, మాటల్లో ఒక్కసారిగా పుట్టివస్తుందనే భ్రమలో పడడం కూడా కాదు. కానీ సంఘం ప్రమాదంలో ఉన్నపుడు రచయిత తన కోసమే తాను తన ఊహసౌదాలనుండి దిగిరావాలి. ఏ కొద్దీమందినో మనోవైజ్ఞానిక సంప్రదాయ రక్షకుల్లాగా భావించి ఊరుకుంటే కఠోరమైన పాపిస్టు దాస్యానికి లోబడ్డ దేశాలలోవలె వారు బలవంతంగా దుష్టశక్తులకు లోబడిపోతారు. అభ్యుదయ రచయితల సంఘం కొన్ని లక్ష్యాలను పెట్టుకుంది. సంకల్పాల్ని ఏర్పాటు చేసుకుంది. మనదేశం సామ్రాజ్యవాద

బానిసత్వం నుండి విముక్తి పొందాలన్నా, జపాన్ దండయాత్ర నుంచి ఆత్మరక్షణ చేసుకోవాలన్న జాతీయ ఐక్యత ఎంత అవసరమో ఉద్ఘాటిస్తూ నాటికలు, కథలు, పద్యాలు, గేయాలు, పదాలు రాయాలి. ఇతరదేశాల అభ్యుదయ రచనలను ముఖ్యంగా ఈ మధ్య వెలువడిన సోవియట్ చైనా సారస్వతాల్ని అనువదించి ప్రచురించాలి.

1943 నుండి 1950 మధ్యకాలంలో అభ్యుదయ సాహిత్యోద్యమం చాలా ఉదృతంగా సాగింది. ఆ తరువాత 1975 వరకు ఎన్నో అవరోధాలను ఎదుర్కొంది. అయనప్పటికీ తెలుగు సాహిత్యంపై అభ్యుదయ కవిత్వోద్యమ ప్రభావం అధికంగానే ఉంది.

సాంప్రదాయ నిరసన అనేది అభ్యుదయ సాహిత్యోద్యమంలో ఎక్కువగా కనిపిస్తుంది. 'మంచి గతమున కొంచెమేనోయ' అన్న గురజాడ వాక్యాన్ని అభ్యుదయ సాహితీవేత్తలు తమ స్ఫూర్తిమంత్రంగా తీసుకున్నారు. ఈ కోవలో ప్రాచీన భారతీయ సాంస్కృతిక వారసత్వ పరంపరను, దాన్ని వైభవాన్ని కీర్తిస్తూ రచనలు చేసిన రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ వంటివారిని సైతం అభ్యుదయ వాదులు వ్యతిరేకించారు. ఆరుద్ర, తాపీధర్మా రావు వంటివారు గతకాలపు సంప్రదాయాల్ని తీవ్రంగా ప్రశ్నించారు. "మాకు గోడలులేవు, గోడలు పగల గొట్టడమే మాపని" అనే దృక్పథాన్ని అభ్యుదయవాదులు వెలగక్కారు.

గతతార్కిక దృక్పథం, చారిత్రక, భౌతిక వాద దృష్టి, శ్రామిక జనవర్గ చైతన్యం మొదలైన అభిలషగేయ లక్షణాలు కలిగిన అభ్యుదయ సాహిత్యోద్యమం తెలుగునాట కొత్త పుంతలు తొక్కిందనే చెప్పాలి.

'అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం
అనాధుడికీ, ఆగర్భ శ్రీనాధుడికీ మధ్య'

అన్న వర్గ చైతన్యాన్ని దాశరథిగారి కవిత్వం వ్యక్తపరిచంది. అలాగే

'అందరం కలిసి చేసిన
అందమైన వస్తు సముదాయమంతా
ఎవ్వడో ఒక్కడే వచ్చి ఎత్తుకుపోతూ ఉంటే
అన్యాయం! అన్యాయం! అని మేమంటే
అనుభవించాలి మీ ఖర్మం అంటాడు' అంటూ శ్రీశ్రీ రాసిన కవిత అభ్యుదయ కవుల వర్గ చైతన్యానికి ప్రతీక.

శ్రమైకజీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని ప్రకటించిన అభ్యుదయ కవిత్వం కార్మికలోకపు కళ్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి సాధనంగా నిలిచిందని చెప్పాలి.

చరిత్ర నిర్మాతలు ఎవరంటే? ప్రజలు. చరిత్ర అంటే చారిత్రక ఘటనల ఉటంకింపు మాత్రమే కాదు, ఆ ఘటనల మధ్య ఉండే కార్యకారణ సంబంధాల వివరణ, విశ్లేషణ అంటారు ప్రసిద్ధ చరిత్రకారుడు ఇ.హెచ్.కార్. మానవజాతి చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రేనంటూ విశ్లేషిస్తున్న దృక్పథాన్ని చారిత్రక,భౌతిక వాదమంటున్నాం. పీడించే వర్గమొకటే, పీడనకు గురయ్యే వర్గమొకటే కొనసాగుతున్న శత్రువర్గ సమాజంలో సంఘర్షణ అనివార్యం. అందుకే....

'నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం
రణరక్త ప్రవాహాస్తికం
దరిద్రులను కాల్చుకుతినడం' అంటూ శ్రీశ్రీ అభివర్ణించారు.

నిరంతం విరుద్ధ శక్తుల మధ్య ఘర్షణ కొనసాగుతూ, ఐక్యత ఉంటుందన్న మార్క్సిస్టు ఆలోచనా విధానాన్ని గతితార్కిక దృక్పథం అంటున్నాం. రెండు పరస్పర వ్యతిరేక శక్తులున్న సామాజిక వ్యవస్థపైకి సహజీవనం సాగిస్తున్నట్లు కనబడుతున్నప్పటికీ, వాటి మధ్య సంఘర్షణ జరుగుతూ ఉంటుంది. సంఘర్షణలోంచి అభివృద్ధి కొనసాగుంది. ఈ క్రమంలో పాత సామాజిక వ్యవస్థ రూపొందుతుందన్న సిద్ధాంతాన్ని గతితార్కిక భౌతిక వాదంగా పిలుస్తున్నాం.

'పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టును' అని శ్రీశ్రీ విశ్లేషించుటలో అర్థం అదే.

ఈ విధమైన అభివ□ద్ధిని కాంక్షించి అభ్యుదయ సాహిత్యోద్యమం 1950-80 మధ్య కాలంలో విస్తృత ప్రచారంపొందిన 'సామాజిక స్పృహ' అనే మాటకు మూలకారణమైంది. 'కళ ఎవరికోసం?' అనేది ఒక మౌళికమైన ప్రశ్న. ఇది ఆధునిక కాలంలో ప్రపంచ వ్యాప్తంగా దర్శనీయమై వినిపించింది. అలాగే 'కళ కళకోసమే' అనే జవాబు సూటిగా ఒక వైపు నుండి వినిపించింది. అయితే మార్క్సిస్టులు ఈ భావాన్ని వ్యతిరేకించారు. 'కళ కళకోసం కాదు ప్రజల కోసం' అని వామపక్షవాదులు సిద్ధాంతీకరించారు. చివరకు ఈ సిద్ధాంతమే 'సామాజిక స్పృహ' అనే భావనకు కారణమైంది. రచయిత లేదా కవి తన రచనలో సామాజిక స్థితిగతుల్ని చూపించాలనీ, సంఘానికి అద్దంపట్టే రీతిలో ఆ రచనలు ఉండాలని అభ్యుదయవాదులు నొక్కి చెప్పారు. ఇదివరకటి 'సాహిత్య స్పృహ' స్థానంలో నూతనంగా 'సామాజిక స్పృహను ప్రతిపాదించడం, దీన్ని కొన్ని దశాబ్దాలపాటు పదిలంగా నిలబెట్టడం అభ్యుదయ సాహిత్యోద్యమం వేసిన ప్రభావంగా చెప్పాలి.

అభ్యుదయ కవిత్వం సమీపకాలంలో భాషలో ఒక నూతన విధానాన్ని అవలంభించింది. కవిత్వానికి ఒక వినూత్నమైన పరిభాష అవసరం అని నొక్కి చెప్పింది. అయితే ఇది వచనాన్ని, కవిత్వాన్ని వేరుచేస్తుంది. భావకవియైన దేవులపల్లి కృష్ణశాస్త్రి చిరస్మరణీయమైన కవితా పరిభాషను సృష్టించారు. దానితో భావకవిత్వాన్ని సుసంపన్నం చేశారు. అలాగే అభ్యుదయ సాహిత్యోద్యమం కూడా కొత్త కవిత్వ పరిభాషను స□జించింది. నిప్పుల కంఠం, అగ్నివీణ, రక్తపతాకం, సామ్రాజ్య తృష్ణ, పీడిత జాతి మొదలైన పదాలు యావత్తు అభ్యుదయ సాహిత్యోద్యమం స్ఫూర్తితో ఆవిర్భవించినవే.

అభ్యుదయ సాహిత్యోద్యమం ప్రాంతీయ అస్తిత్వవాదానికి కూడా ప్రతీకగా నిలిచింది. తెలంగాణా విముక్తి పోరాటం, ఆంధ్ర రాష్ట్రోద్యమం వంటి ప్రత్యేక వాదాలకు స్ఫూర్తిదాయకం అయ్యింది. దాశరథి, కాళోజీ, ఆవత్స సోమసుందర్, రెంటాల, కుందుర్తి మొదలైనవారు తెలంగాణా విముక్తి కోసం అనేక అభ్యుదయ గేయాలు రాశారు. 'మా నిజాం రాజు జన్మ జన్మల బూజు' అని దాశరథి ఎలుగెత్తి చాటారు. అలాగే ..

"చుట్టూ సముద్రం పొంగి
నట్టనడిగడ్డను మ్రింగి
అంతా ఏకం చేస్తుం
దంతా ఒకటౌతుంది" అని హైదరాబాదుకు నాలుగు వైపులనుండి ఉవ్వెత్తుగా వస్తున్న ప్రజావిప్లవాన్ని పీడిత జన చైతన్యాన్ని వ్యంగ్యంగా వ్యక్తం చేశారు.

అభ్యుదయ కవులు ఆంధ్ర రాష్ట్రోద్యమంపై కూడా కవితల్ని వెలువరించారు.

"వేదంలా గోదావరి ప్రవహిస్తుందే చెల్లీ
వెన్నెలవలె కృష్ణవేణి విహరిస్తుందే చెల్లీ" అంటూ గానం చేశారు.

అలాగే.. "పదవోయి తెలుగువాడా
అదే నీ తెలుగు మేడా
సంకెళ్ళులేని నేల
సంతోష చంద్రశాల" అని తెలుగువారి సముజ్జల భవిష్యత్తును పాడి వినిపించారు.

ఇంకా అభ్యుదయవాదులు సమసమాజ నిర్మాణం కోసం పాటుపడ్డారు. తమ కులాలను ఆయుధాలుగా చేసుకొని చైతన్య స్ఫూర్తిని నింపారు.

"ఆకలి వేస్తోందమ్మా అన్నం పెట్టమ్మా
స్వర్ణారుణ సస్యశ్యామలమగు
ఈ జగతిని దరిద్రమున ఆకలితో చావలేను" అని ఆక్రందించు ప్రజల బాధల్ని తమ లేఖల్లో రాశారు.

ఇలా అభ్యుదయ సాహిత్యంలో తీసుకొచ్చిన ప్రభావం నేటికీ ప్రతీ అంశంమీద ఉందంటే ఆ కవితోద్యమం ఎంతటి ఉద్యమ స్ఫూర్తిని నింపిందో అర్థమవుతుంది. ఆ ప్రభావం ఎంతగా ఉందంటే ఎంతోమంది కవులకు, రచయితలకు వెలకట్టలేని ప్రాముఖ్యతనిచ్చింది. పలుతరాల వారు వారిని గుర్తుంచుకునేలా చేసింది. మహాప్రస్థాన కర్త శ్రీశ్రీ అభ్యుదయవాదుల మహాకవి అయ్యారు. మహాప్రస్థానం తరువాత అభ్యుదయవాదాన్ని వదిలి 'అధివాస్తవికత' వైపు పరుగులు తీసినా ఆయనగురించిన పూర్వపు తాత్విక ప్రచారం అలాగే ఉండిపోయింది. ఆధునిక సాహిత్యానికి అర్థం తెలిపిన సోమసుందర్, ఆరుద్ర, కాళోజీ, అనిశెట్టి, సి.నా.రె., దాశరథి, రెంటాల గోపాలకృష్ణ, కొడవటిగంటి కుటుంబరావు, ఆత్రేయ మొదలైన సాహితీ వేత్తలందరూ అభ్యుదయ ప్రాభవానికి లోనయి చివరకు ఉద్యమంలో భాగస్వాములుగానే ఉండిపోయారు.

తెలుగునాట తలెత్తుతున్న ప్రజాఉద్యమాలతో మమేకమవుతూ, ఉద్యమాలకు ఊపిరిలూదుతూ అభ్యుదయ కవిత్వం ఒక సజీవ చైతన్య స్రవంతిలా ప్రవహిస్తూ పురోగమిస్తూ ఉంది. దాదాపు నాలుగు తరాల రచయిలను ప్రభావితం చేసిన అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యంలో ప్రజలనుంచి కవులనూ, కళాకారులనూ సృష్టించుకుంటుంది.

గతకాలపు తెలుగు సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడంలో అభ్యుదయ సాహిత్యోద్యమం తన వంతు కృషి చేసింది. అభ్యుదయ సాహిత్య ఉద్యమం తెలుగు సారస్వతంపై ప్రసరింపచేసిన ప్రభావం కాదనడానికి వీలులేనిది. అయితే అంతర్జాతీయంగా చూస్తే 1980-90లో తూర్పు యూరప్‌లో సంభవించిన పరిణామాలు, 1991లో సోవియట్ పతనం వంటివి అభ్యుదయసాహిత్య ఉద్యమ ప్రభావాల్ని బలహీనపరిచాయి. కాని సామాజిక స్పృహ వాదన బలహీన పడుతోంది. 'సాహిత్య స్పృహ' సిద్ధాంతం మరోమారు వేదికపైకి వస్తూంది. 'విషయంకన్నా, ఆ విషయాన్ని చెప్పే తీరు చక్కగా ఉండాలి' అని మౌలిక సాహిత్య సూత్రానికి అంతకంతకూ ఆదరణ పెరుగుతోంది. సంప్రదాయ అంధ నిరసనను ఈ తరం అంగీకరించడం లేదు. ఈ విధమైన పరిణామాల నేపథ్యంలో అభ్యుదయ సాహిత్య ఉద్యమ ప్రభావం రోజు రోజుకు తగ్గుతుందనేది నమ్మాల్సిన నిజం. అయినప్పటికీ రూప, విషయ సముచిత సమన్వయంతో , పీడితవర్గ దృక్పథంతో, సమాజ జీవితంతో పెనవేసుకుపోతూ అభ్యుదయ కవిత్వం ఒడుదుడుకులను అధిగమిస్తూ నిరంతరం ప్రవహిస్తూనే ఉంది.

**ఆధార గ్రంథాలు:**


1. ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలకతు - కేతవరపు రామకోటి శాస్త్రి
2. తెలుగులో కవితావిప్లవాల స్వరూపం - వెల్చేరు నారాయణ రావు
3. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
4. తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న
5. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు - జి.వి. సుబ్రహ్మణ్యం


**Citation:** డా. పులపర్తి శ్రీనివాసరావు 2025. "తెలుగు సాహిత్యం - అభ్యుదయ కవిత్వోద్యమ ప్రభావం". International Journal of Academic Research, 12(4): 161-166.
**Copyright:** ©2025 డా. పులపర్తి శ్రీనివాసరావు. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.